తానా 2005

# ఎంత నేర్చినా...

శ్రీమతి ఎ.ఎస్. మణి

**విశాల్ నన్ను రమ్మంటే ఐదు రోజులు సెలవు పెట్టి బొంబేకి వచ్చాను ఫ్లైట్‌లో. విశాల్ ఉంటున్న ఫ్లాట్ చాలా కంఫర్టబుల్‌గా, లగ్జరియస్‌గా ఉంటుంది. ఇక్కడికి వస్తే ఎడారిదాటి ఒయాసిస్‌కి చేరుకున్నట్లు సుఖంగా హాయిగా ఉంటుంది. మామూలు ప్రపంచం, మామూలు మనుషులూ మాయ మైపోతారు. ఒక అందాల దీవిలో ఆనందంలో తేలుతున్న అనుభూతి మన సుని మత్తులాగ ఆవరిస్తుంది. ముఝె మస్త్ మహోల్‌మె జీనేదో....**


సాయంత్రానికి వస్తానని చెప్పి వెళ్ళాడు విశాల్. విశాల్ కూడా ఆఫీసుకి సెలవుపెట్టాడు. మూడు రోజులు హాయిగా గడిచిపోయాయి. ఇవేళ ఆఫీసు నించి రమ్మని ఫోను వస్తే తప్పని సరిగా వెళ్ళాడు. హాలిడే తీసుకున్నా ఏమిటో ఆఫీసుపని! ఈ సెల్‌ఫోన్ ఒకటి! మారుమూల స్వర్గంలో ఉన్నా డిస్టర్బ్ చేస్తుంది. బాధ్యతలు బరువు కాదుకానీ హాలిడేకి అడ్డు రాకూడదు.

హాలిడే ఎంజాయ్ చెయ్యాలంటే మంచి వెదర్, మంచి ఫుడ్, అరుదైన షాపింగ్ మంచి కంపెనీ కావాలి. అన్నీ సమకూడాయి.

విశాల్ కంటె మంచి కంపెనీ ఎవరు?

ట్రెండీగా డ్రెస్ చేసుకుంటాడు. విట్టీగా మాట్లాడతాడు. పంక్చుయాలిటీ పాటిస్తాడు. కీప్స్ హిస్ ప్రామిసెస్... మనసు విప్పుతాడు... స్ట్రైట్‌గా!

అందుకే మూడు రోజులూ హాపీగా గడిచిపోయాయి. క్షణాలు గంటలుగా! గంటలు క్షణాలుగా! తామరాకు మీద మంచుబిందువులా పూలతోటలో సీతాకోక చిలుకలాగ.





ఈ పగలంతా నాతో నేను... నా కోసం నేను గడపాలి! పాంపరింగ్ మై సెల్ఫ్! జకూజీలో స్నానం గంట పట్టింది. పెర్‌ఫ్యూమ్ పరిమళంలో తేలిపోతూ మంచు బిందువుల్లో తడిసిన గులాబీలా ఫీలింగ్. మనసులో సంగీతం...గులామాలీ జోలపాట!

కాజువల్ వియర్ జీన్స్ కుర్తా వేసుకున్నాను.

పంచ్ తాగుతుంటే ఆరోగ్యంగా ఉన్న అనుభూతి. దేహమంతటా కొత్త శక్తి ఆవరించిన ఉత్సాహం. ఇప్పుడు ఏం చెయ్యటం?

గుర్తువచ్చింది. ఫోటోలు ఇస్తానన్నాడు.

తాళం చెవి తీసుకుని ఫ్లాట్ డోర్ లాక్ చేసి లిఫ్ట్‌లో క్రిందికి వెళ్ళాను. వీధి చివరదాకా నడిచి మెయిన్ రోడ్ మీద ఉన్న ఫోటో కార్నర్‌కి వెళ్ళాను. ఫోటోలు తీసుకుని బిల్ పే చేసి పక్కనే ఉన్న మెడికల్ షాప్‌కి వెళ్ళాను. ఇవియాన్ కాప్స్యూల్స్, లిప్‌గ్లాస్‌కొన్నాను. జనం బాగానే ఉన్నారు.

ఒక అమ్మాయి...జడ, చీరలో తెలుగు దానిలాగ ఉంది. ఒక కార్డ్‌చూపించి ఎవరినో ఎడ్రస్ అడుగుతోంది....వచ్చీరాని హిందీలో. ఒక పిల్ల కూడా ఉంది. ముద్దు వస్తోంది. బొంబేలో ఉంటూ కూడా ఇంకా ఆధునికత వంట బట్టినట్లు లేదు.

నవ్వుకుని వచ్చేశాను.

***

లోపలికి రాగానే ఆ ప్రపంచం దూర దూరంగా జరిగిపోయింది. మనసులో సంగీతం. పూలతోటలో సీతాకోక చిలుకలాగ....

సోఫాలో కూర్చుని కవరులోంచి ఫోటోలు తీశాను. అవి విశాల్ తీశాడు బీచ్‌లో. నా ఫోటో.... ఎంత బాగుంది! నేను పొడుగు ఎబౌ ఏవరేజ్.

చిన్నప్పుడు స్కూల్లో గెడకర్ర అనేవారు. ఎక్కరించేవారు. ఇప్పుడు?

ఎంత పొడుగైతే అంత అందం. శిల్పాసెట్టి, ఐశ్వర్యల లాగ.

పెదవుల మీద ఆ నవ్వు... ఆనందంతో విరిసిన పువ్వు.

ఒక నవ్వు మనసులో దీపాల్ని వెలిగిస్తుంది.

ఒక చూపు మనసుల్ని ముడివేసి అనుబంధం సృష్టిస్తుంది.

మామూలు పరిచయం అనుబంధంగా మారుతుంది.

విశాల్‌తో పరిచయం మొదట ఆఫీసులోనే

అయింది. అనుబంధంగా మారింది. ఆఫీస్ పనిమీద బొంబే నించి వస్తూనే ఉంటాడు.

''నువ్వొక పూలతోటవి!'' అంటాడు బుజాల మీద పడే నా జుట్టుని సవరిస్తూ. అతడికి నేనే ప్రపంచం. నాకు కూడా!

ప్రేమ ఏమిటి? అర్థం లేని మాట.

ఆలోచించటం దండగ. అనుభవించటం సత్యం.

మనిషికి ఏం కావాలి? ఆనందం కావాలి.

ప్రేమ త్యాగం కోరుతుంది అంటారు! అది బలహీనులు, ఏదీ సాధించలేని వాళ్ళు చెప్పే మాట. ప్రేమ ఆనందాన్ని కోరుతుంది. అన్ని బలహీనతల్నీ అధిగమిస్తుంది.

ప్రేమని సాంఘిక నియమాలు బంధించలేవు. అది స్త్రీ బలహీనురాలిగా బ్రతికినప్పటి పాతమాట.

ఇంకొక ఫోటో తీసాను.

అది నేనేనా? ఔను. విశాల్‌ని చూస్తుంటే అతడి ప్రేమ నన్ను తాకుతుంటే నా కళ్ళు అలా వెలిగిపోతాయే. మనసులో పుట్టే ఆనందం అలలుగా శరీరమంతా తరంగితమై కళ్ళలో తారకలై వెలుగుతుంది.

విశాల్ వెళ్ళాక ఒక అరగంట దాకా తేరుకోలేకపోయాను.

రాత్రంతా ఒకరి కౌగిలో ఒకరు ఇమిడి గడిపినా తీరని ఆకాంక్ష!

శరీర దాహం తీరుతుందేమో కానీ మనసు దాహం తీరదు. మనసుకి హద్దు లేదు కదా!

ఒక మనిషి ఇంకొక మనిషిలో ఇంత ఆనందం కురిపించగలరా!

విశాల్ నావాడు. నేను ఎప్పటికీ అతడిని వదలను. వదలలేను.

ఈ మూడు రోజులూ నా జీవితంలో ఆనందోత్సవం.

జీవితం సముద్రం లాంటిది. ఆగకుండా అనుభవాలు కెరటాలై వస్తూనే ఉంటాయి. కానీ ఈ కెరటం ఇక్కడే– ఈ క్షణాలు, ఘనీభవించి ఇలాగే ఆగిపోతే బాగుండునని పిస్తోంది. అతడు వెడుతుంటే బాధ వేసింది. కానీ ఒక విధంగా మంచిదే! ఏకాంతంలో తమ ఇద్దరి మధ్య ఉన్న ఈ అనుబంధాన్ని మననం చేసుకుంటుంటే ఆనందం అధికమౌతోంది.

***

విశాల్ సాయంత్రం దాకా రాడు. ఒంటరిగా గడపాలి.

కాస్త ఎడబాటుకి భయపడితే ఎలా! తను అంత బేలకాదు.

లోకంలో అందరికీ ఎన్నో సమస్యలుంటాయి.

ఒకప్పుడు తనూ ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంది. ఎన్నో కష్టాలుపడి లేచింది.

చదువుకుంది. ఉద్యోగం సంపాదించింది. కుటుంబ బంధాలనించి బయట పడింది. అదృష్టవశాత్తూ టీనేజ్‌లో కలిగిన ప్రేమ విఫలమై పెళ్ళి కాలేదు.

లేకపోతే తనూ ఒక సామాన్య గృహిణిలా మిగిలిపోయి ఉండేది.

ఇప్పుడు తను సర్వ సమర్థురాలైన యువతి. తన జీవితం తను నడుపుకోగలిగిన పూర్ణయువతి. ఎవరికో భయపడి తల ఒంచాల్సిన అవసరం లేని స్వతంత్ర జీవి. తనకి పెళ్ళి అనే సాంఘిక బంధం లేదు. తనకేం కావాలో అది పొందటమే తన లక్ష్యం! తన జీవితం!

విశాల్ దొరకటం...తన అదృష్టం!

''నేను ప్రేమించగలనని, ప్రేమకు అర్థం తెలిసింది నీవలన. ఇప్పుడు నాకు నీ కంటే ఏదీ ముఖ్యం కాదు. ప్రపంచంతో నాకు సంబంధం లేదు. నీ కోసం, ఈ ఆనందం కోసం నేను దేనిన్నైనా వదులుకుంటాను. నిన్ను మాత్రం వదులు కోలేను. నాకు పెళ్ళయింది కానీ నాకు అనుబంధం ఏర్పడలేదు. అది ఒక అసహాయత... అసహ్యకరమైన పరిస్థితి...'' అని చెప్ప బోయాడు విశాల్ ఒకసారి.

పెళ్ళి, భార్య, భర్త! ప్రేమ వైశాల్యం ముందర ఎంత చిన్నపదాలు!

''ఆపు. నాకు అవేమీ చెప్పకు. అదంతా మామూలు జీవితం. పెళ్ళి, కుటుంబం, సంఘం చాలా సంకుచితమైనవి. మనిషి ఆత్మని హింసపెట్టి కృంగదీస్తాయి. వాటినించి పైకి ఎదగటం....అదృష్టం. మనమిద్దరం ఇలాగ ఉంటే చాలు'' అంది తను.

స్వార్థం తప్పు అంటారు...వ్యక్తిని లొంగదియ్యటానికి.

స్వార్థం లేకపోతే మనిషి ఎదగడు. స్వార్థం ఉంటేనే ఏదైనా సాధించగలడు. నేను....నాది అనే అనుభూతి లోనించి కదా ఆనందం పుడుతుంది!

స్వార్థం లేనిదే మనిషి లేడు. జీవితం లేదు.

ఈ ఆనందం వదులుకుంటే ఏం మిగులుతుంది? శూన్యం, రోదనం తప్పు! ఒక రకంగా బావ రైటేనేమో! స్వార్థపరుడు.

''ఇంత ప్రపంచం ఇన్ని అందాలు ఉండగా ఒక గుడ్డి దీపం నీడలో పిగ్మీ లాగ బతకమంటావా?'' అన్నాడు అక్కయ్యతో.

'గుడ్డి దీపం' అవమానంతో తనని తను దగ్ధం చేసుకుంటది. అందమైన శరీరం, మనసు. నల్లగా వికృతంగా... ముగిసింది అక్క.

ఎప్పటికీ క్షమించలేదు బావని... ఆ మగ జాతిని!

ప్రేమ దొరక లేదు అక్కకి అది అంత హింసా! ఔను.

ప్రేమ దొరికిన జీవితం సౌందర్యంతో వెలిగిపోతుంది.

ప్రేమ లేని బ్రతుకు రగిలి కాలిన కట్టె. ప్రేమలేని మనసు బూడిద.

ఇది వరకు ప్రపంచం తెలుపు–నలుపు ప్రపంచం! తప్పు– ఒప్పు...రెండే రంగులు.

ఈనాటి ప్రపంచం... ఏడు రంగులు కాదు. వివిధ ఛాయలలో, వర్ణమిశ్రమాలతో...రంగులు పులుముకుంది. ధగధగా మెరిసిపోతోంది. ఇంత కంటే స్వర్గముందా.

***

నిన్న ఎంత ఆనందంగా గడిచింది. షాపింగ్‌కి వెళ్ళాము. మూడు ఔట్‌ఫిట్స్ కొన్నాడు విశాల్ ఇరవై వేలయింది. అతడి బహుమతి! బహుమతి అందుకోవటంలో ఎంత ఆనందం ఉంది! అవి ధరిస్తే తన ఒంపులకి అనుగుణంగా మలుచుకుపోయి ఆ దుస్తులు తన మూర్తికి ఒక దివ్యత్వాన్ని ఇస్తాయి.

జీవితం సముద్రం లాంటిది. ఆగకుండా అనుభవాలు కెరటాలై వస్తూనే ఉంటాయి. కానీ ఈ కెరటం ఇక్కడే – ఈ క్షణాలు, ఘనీభవించి ఇలాగే ఆగిపోతే బాగుండు ననిపిస్తోంది. ఏకాంతంలో తమ ఇద్దరి మధ్య ఉన్న ఈ అనుబంధాన్ని మననం చేసు కుంటుంటే ఆనందం అధికమౌతోంది.

ఆకాశానికి మబ్బుల తెరలాగ, ఫైరుల మీంచి మంచి గంధం లాగ

మనసుని సంతోషం ఆవరిస్తుంది. ఒక స్వప్నావస్థ కలిగిస్తుంది.

ఆకాశం నక్షత్రాలు పొదిగిన రాత్రి పమిట వేసుకున్నట్లు!

గోల్డ్‌కలర్ డ్రెస్‌లో ''నువ్వు స్వర్ణసుందరివి'' అన్నాడు విశాల్ చున్నీ సర్దుతూ.

రసార్ద్ర హృదయం లేకపోతే అందానికి అనుభవం లేదు.

అది అడవి గాచిన వెన్నెల.

తప్పు, తప్పు అంటారు. అసలు తనకి సరిపడని మొగవాడితో ఎందుకు సంసారం చేయ్యాలి?

తన కోరికలు, స్వాభిమానం, జీవేచ్ఛ నలిపేసి... ఆర్పేసి... ఎందుకు సహజీవనం చెయ్యాలి. శక్తి ఉన్న ఆడది చెయ్య కూడదు. తన జీవితాన్ని తనే మలుచుకోవాలి. తన ఇచ్ఛానుసారం బ్రతకాలి.

లేకపోతే నిన్నటి అనుభవం దక్కేదా?

నలుపు సిల్క్ మీద జర్‌దోసి 'వర్క్‌షరారాలో రాత్రి రాణిలా ఉంది తను.

నగ్నత్వానికి ఆభరణం దుస్తులు. అందుకే దుస్తుల ఎంపిక చాలా నేర్పుగా చెయ్యాలి.

వలువల వలువ అమోఘం!

ఎవరో కుదిర్చిన పెళ్ళి చేసుకుని, ఆ పెళ్ళినించి ప్రేమని ఆశించే ఆడవాళ్ళ మీద జాలి వేస్తుంది. అసహ్యం కూడా వేస్తుంది.

ఆ కూపంలోంచి ఎందుకు బయటికి రారూ? అదే బలహీన త! స్త్రీ చరిత్ర. అక్కయ్య కథ కూడాను.

బుగ్గన చుక్క, నుదుట కళ్యాణం బొట్టుతో పెళ్ళిరోజున చూసింది అక్కయ్య మొహంలో వెలుగు. పెదవుల మీదనవ్వు మళ్ళీ చూడలేదు. బావ అక్కయ్యకి ఇచ్చిన బిరుదు పతివ్రత. అంటే పతిని సాధించటమే పని. ''సిగరెట్లు కాల్చకు! మద్యం ముట్టకు. ఆఫీసు అమ్మాయిలతో తిరగకు'' అంటూ వేధించటం. బావ అన్నీ కొట్టిపారేశాడు.

''పాతకాలపు నీతులు నాకు చెప్పకు. పుట్టడం బ్రతకటం ఎందుకు? ఆనందం అనుభవించటానికి. నీకు తిండి గుడ్డ ఇస్తున్నాను. పిల్లల్ని ఇచ్చాను. ఆఖి చూసుకుని సంతోషించు'' అనేవాడు అక్కతో.

తనకి కూడా చాలా కోపం వచ్చేది.

''నీకు అదే ముఖ్యమైతే పెళ్లి ఎందుకు చేసుకున్నావు బావా?'' అని అడిగింది.

''మీ అక్కని ఉద్ధరించటం!'' ఏకోశానా నిజాయితీ అన్నది లేదు.

అతడి కొలీగ్ సుజాతతో రెండో ఇల్లు ఏర్పాటు చేసుకున్నాడని తెలిసి అక్కయ్య నిద్రమాత్రలు మింగింది.

ఎలాగో బ్రతికించారు కానీ అక్కయ్య మళ్ళీ

మంచం దిగలేదు.

''నువ్వు ఉద్యోగం చెయ్యి వాడిని వదిలెయ్యి. నువ్వంటే ప్రేమ లేనివాడు నీకెందుకు?'' అని బోధించబోతే

''జీవితంలో ఇంకేముంది?'' అంది నిస్పృహతో కృంగిపోతూ.

మనసు మూసుకుపోతే మరోమార్గం లేదు కానీ ప్రపంచం ఎంత విశాలమైంది! ఎన్ని మార్గాలు లేవూ! చదువుకోవచ్చు! అనంతమైన విజ్ఞానం ఉంది. ఎన్నోరకాల ఉద్యోగాలు ఉన్నాయి. ఆలోచన విశాలం చేసుకుంటే సంఘసేవ..రాజకీయాలు....దేశాటనం... ఒకటా జీవిత దర్శనానికి మార్గాలు. అక్కయ్య కళ్ళు మూసేసుకుంది. దేనినీ చూడలేకపోయింది. తనకి ఇద్దరు పిల్లలున్నారని కూడా మరిచిపోయింది.

''మీ బావకి నా మీద ప్రేమ లేదు. నేను భరించలేను ఈ జీవితాన్ని'' అంది. ప్రేమ కోసం అంత దేబిరించాలా? అది పిల్లల కంటె ఎక్కువా? ''పిల్లలెవరు? ప్రేమలేనప్పుడు...బైప్రొడక్ట్స్. అతనికి అక్కర్లేదు'' అనుకుంది.

బావతో పోట్లాడి పోట్లాడి విసిగిపోయింది. చచ్చిపోయింది. కిరసనాయిలు పోసుకుని కాల్చుకుని!

భార్యని నిర్లక్ష్యం చేసి మరొక ఆడదాన్నిమరిగిన మగవాడు బావ.

పిల్లల్ని అతడి తల్లి దగ్గర వదిలేశాడు... అక్కయ్యపోయాక.

''నీ పిల్లలపట్ల నీకు బాధ్యత లేదా?'' అని నిలదీసింది ఒకసారి తను. ''నన్ను పెళ్ళి చేసుకో మనిద్దరం కలిసి బాధ్యత పంచుకుందాం'' అన్నాడు.

ఇటువంటి మగవాడిని క్రాస్ రోడ్స్ మధ్య నిలబెట్టి కాల్చాలి.

తను కోరుకున్నట్లు బ్రతకాలనుకున్నాడు బావ.

స్వతంత్రంగా జీవించటమంటే ఇదేనా? ఏ నీతి నియమాలకి పట్టుబడకపోవటం. తనకి జీవితం మీద, మొగవాడి మీద, పెళ్లి మీద అసహ్యం వేసింది. కానీ... అది ఎన్నాళ్లో నిలబడ లేదు.

వేరే ఊళ్లో ఉద్యోగం వచ్చింది. తల్లిని వదిలి హైదరాబాద్‌కి వచ్చింది. అక్కడ పరిచయాలు, స్నేహాలు పెరిగాయి. స్నేహితురాలి పెళ్లిలో కిరణ్ పరిచయమయ్యాడు. మన ఆలోచనల్ని, అభిప్రాయాల్ని కాదని మనసుని లొంగ దీసుకునే శక్తి ఉంది. అది స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ?

'వద్దు' అనుకుంటూనే అతడి మాటలు, చూపులు, చేష్టలకి లొంగిపోయింది. తల్లి సంబంధాలు చూస్తూనే ఉంది. తనకి నచ్చిన వాణ్ణి తప్ప అటువంటి పెళ్ళి చేసుకోకూడదని నిశ్చయించుకుంది. అమ్మకేమీ తెలీదు. తన ఆలోచనలు. నచ్చిన వాడు వచ్చాడు. అతడితో పిక్నిక్‌కి వెళ్ళింది. సినిమాలు, హాలిడేలు ఎన్నో సరదాలు, స్నేహితులంతా కలిసి తిరిగే వారు.

ఒకసారి మహాబలిపురం వెళ్లారు.

సముద్రం ఎత్తిపోసే అలలతో అల్లరి పిల్ల మనసులాగ ఉంది. అక్కడ ఎవరెవరో ఉన్నా, లోకంలో తామిద్దరే! ఉన్నట్లు అనుభూతించే క్షణాలు.

''నేను నీ వాడిని! నా దానివి కావటానికి సందేహిస్తున్నావా?'' అనడిగాడు కిరణ్. ఇద్దరూ అలలతో ఆడి తడిసి పోయి ఉన్నారు.

''ఈ జీవితం నాది. ఈ దేహం, మనసు, ఆత్మ నావి. నా జీవితం మీద అధికారం నాదే. మన మధ్య ప్రేమ ముఖ్యం. మిగిలిన విషయాలు అల్పమైనవి'' అంది.

ఆరోజు కాటేజీలో ఉండిపోయారు. ఆనందంలో ఏకమయ్యారు. ఏకమై ఆనందించారు.

ఆనందానికి నీతికి సంబంధం లేదు.

పెళ్లి ఒక సామాజిక నియమం. మనిషిని తనగుప్పిట్లో ఉంచుకోటానికి సమాజం ఏవో గీతలు గీస్తుంది. ధైర్యం కలవాళ్ళు వాటిని పాటించనవసరం లేదు. రూల్స్ ఆర్ ఫర్ ఫూల్స్ అంటారు కదా.

**''ఈ జీవితం నాది. ఈ దేహం, మనసు, ఆత్మ నావి. నా జీవితం మీద అధికారం నాదే. మన మధ్య ప్రేమ ముఖ్యం. మిగిలిన విషయాలు అల్పమైనవి'' అంది. ఆరోజు కాటేజీలో ఉండిపోయారు. ఆనందంలో ఏకమయ్యారు. ఏకమై ఆనందించారు. ఆనందానికి నీతికి సంబంధం లేదు.**

ఒకరోజు కిరణ్ మొహం దిగులుగా పెట్టుకుని వచ్చాడు.

''మీరా! నా పెళ్ళి నిశ్చయమైంది. నేను ఒప్పుకోవాల్సి వచ్చింది. మా నాన్న హార్ట్ ఆపరేషన్ కోసం రెండు లక్షలు కావాలి. వాళ్ళు ఒక లక్ష ఇస్తామన్నారు కట్నంగా. నేను ఈపెళ్ళికి ఒప్పుకోక పోతే మా అమ్మ బావిలో పడి... చస్తానంది'' ఏడ్చినంతగా బాధ పడిపోతూ చెప్పాడు.

అప్పటికి తనకింకా పెళ్ళి మీద నమ్మకం పూర్తిగా పోలేదు. తనకి నచ్చిన కిరణ్‌ని పెళ్ళి చేసుకుందామనే అనుకుంటోంది. ఇప్పుడు ఇది తనకి షాకయింది.

ఏడిచింది నెలరోజులు తిండి తిన లేదు సమంగా.

తన దగ్గర ఒక లక్ష ఉంటే తనకి కిరణ్‌తో పెళ్ళయి ఉండేది.

తన బీదరికం మీద కోపం వచ్చింది.

'స్టుపిడ్.... ఇడియెట్.... పో వెళ్ళి ఆ బంధాలలో చిక్కు. ప్రేమకంటె తండ్రి ఎక్కువా? వాళ్ళు నిన్ను వాడుకుంటున్నారు. కుటుంబం ఒక సామాజిక బంధం. ప్రేమకంటె ఎక్కువా? దాని కోసం ప్రేమని వదులు కోవటం బలహీనత!' అనుకుంది. అసహ్యంతో తన బాధని కూడా మరిచిపోయింది.

''నేను పెళ్లి, కుటుంబ బంధాల ఉచ్చులో చిక్కను. ఇది నా కొక పాఠం. ఇంక ఏడవను. ఈ కిరణ్ పోతే ప్రపంచంలో ఇంకెవరూ లేరా? అతడిది నిజమైన ప్రేమ కాదు'' అనుకుంది.

అతడికి తనశరీరం అర్పించినందుకు తను బాధ పడలేదు. తనకి శరీరపు పవిత్రత మీద నమ్మకం లేదు. ఎంతమంది భార్యలు భర్తని అసహ్యించుకుంటూ ఒళ్ళు అప్పగించటం లేదూ! మొగవాడి సంగతి చెప్పనవసరమే లేదు. వ్యభిచారానికి ప్రతిరూపం. అంతా అసహ్యం. అంతకంటె ప్రేమతో ఒక రోజైనా, ఒక గంటైనా పూర్తి మనిషిగా అనుభవించటం ఔన్నత్యం'' అనుకుంది.

తను మారిపోయింది. ఈ నాటి జీవితంలో స్త్రీ అణచివేత, హిపోక్రసి తనకు కళ్ళకు కట్టింది. తను ఎదగాలి. ఇంకా ఎదగాలి. తన రూపం, తన అందం ఆరోగ్యం మీద శ్రద్ధ వహించింది. యోగా, మెడిటేషన్ క్లాసులకి వెళ్ళింది. అబద్దాలు, అసూయ...తనకి దూరంగా జరిగిపోయాయి. తనకి విశాల్ దొరికాడు... ఈ అన్వేషణలో. ప్రేమానుభవం కలిగించాడు. తూమిలే దిల్‌ఖిలే ఔరు జీనేకో క్యాచాహియే! మనసులో సంగీతం... ఇద్దరి మనసులూ అల్లుకుపోయాయి. విడదీయ లేనంతగా. నెలకొకసారైనా హైదరాబాద్‌కి వస్తాడు. అతడితో గడిపే ఆ రెండు రోజులూ చాలు మళ్ళీ కలుసుకునే దాకా మమత వెలుగుతూ ఉండటానికి.

సాయంత్రానికి వస్తానన్నాడు. అప్పటిదాకా గడపాలి...గంటలు లంచ్‌లో... ఏమీ తినాలనిపించటం లేదు.

***

ఇంకొక ఫోటో చేతిలోకి తీసుకుని చూస్తున్నాను. కాలింగ్ బెల్ వినిపించింది. 'విశాల్ వచ్చేసాడా! అప్పుడే వస్తాడా?' అనుకుంటూ తలుపు తీశాను.

ఒక క్షణం నివ్వెరపోయాను. ఇందాక మెడికల్ షాపు దగ్గర చూసిన యువతి.

''ఎవరు మీరు? ఏం కావాలి?'' హిందీలోనే అడిగాను.

ఆ అమ్మాయి కూడా అలాగే చూస్తూ నిలబడింది.

''మీరు తెలుగు వారా? ఏం కావాలి?'' ఈ సారి తెలుగులోనే అడిగాను తల ఊపింది.

''సహాయం...హెల్ప్'' లోగొంతుకలో మెల్లగా అంది.

''ఏం హెల్ప్....''

''ఒక గ్లాసు నీళ్ళు. దీని పేరు స్నేహం. ఆరోగ్యం బాగుండదు. దాహం వేస్తోందిట''

''లోపలికి రండి, కూర్చో'' అన్నాను.

లోపలికి వచ్చింది. కిచెన్‌లోకి వెళ్లి ఒక గ్లాసు వాటర్ బాటిల్ తెచ్చి అందించాను. ఆ అమ్మాయి కూర్చో లేదు. పాపకి మంచి నీళ్ళు తాగించింది. తర్వాత సూటిగా చూస్తూ ''నాకొక సహాయం కావాలి'' అంది. హ్యాండ్‌బేగ్‌లోంచి మెడికల్ రిపోర్ట్స్ లాంటివి తీసింది. ఇంకా ఏమిటి అన్నట్లుగా చూశాను.

''నాకు ఇద్దరమ్మాయిలు ఇది చిన్నది. భర్త వదిలేశాడు. దీనికి హార్ట్ ప్రాబ్లెమ్ ఉంది. ఆరునెలలనించి మధ్యమధ్య తెలివి తప్పి శరీరం నల్లగా అయిపోతుంటుంది. డాక్టర్ చూసి హార్టు ఆపరేషన్ చెయ్యాలన్నాడు. ఏ క్షణంలో ప్రాణం పోతుందోనని క్షణ క్షణం నరకమనుభవిస్తున్నాను. ఆపరేషన్‌కి ఒక లక్షేనా అవుతుంది. నేనెక్కడ నించి తేగలను...'' అంటుంటే ఆవిడ కళ్ళనిండా నీళ్లు వచ్చాయి.

''మీ కెవరూ లేరా?'' అడిగాను.

ఆవిడ ఏడుపు ఆపుకుంటోంది అనిపించింది.

ఈ అమ్మాయి చెప్తున్నది నిజమేనా?నేనొక ఐదు వేలు ఇవ్వగలను జెన్యూయిన్ ఐతే విశాల్ చేత పది, ఇరవై వేలు ఇప్పించగలను. ఎక్కడైనా నా హాస్పిటల్లో ఛారిటీ చేసిన్ కింద ఆపరేషన్ ఏర్పాటు చెయ్యొచ్చు. కానీ ఇదంతా నిజమేనా! డబ్బుకోసం వేషమా! నా ఆలోచనలు సాగిపోతుంటే ఆ పిల్ల మూలుగుతున్నట్లు అనిపించింది. చూశాను. తెల్లగా ఉన్న మొహం, పెదవులు నీలంగా మారుతున్నాయి. ఆ పిల్లతల్లి చటుక్కున ఆ పాపని పట్టుకుని వొళ్ళో

పడుకోబెట్టుకుంది. హాండ్ బేగ్‌లోంచి ఇన్‌హేలర్ తీసి వాసన చూపించింది. ఒక టాబ్లెట్ నోట్లోవేసి నీళ్ళు తాగించింది.

పాప తేరు కుంటోంది అనిపించింది.

ఐతే ఆవిడ చెప్పిందంతా నిజమేనన్నమాట!

''పాపం! చాలా కష్టంలో ఉన్నారు. నేనొకైదువేలు ఇవ్వగలను ఇస్తాను'' అన్నాను. ఆవిడ తల అడ్డంగా ఊపింది.

''విశాలరావ్‌గారు లేరా? ఎప్పుడు వస్తారూ?'' అంది.

విశాలరావ్! అంటే విశాల్...పేరు ఈవిడకి ఎలా తెలుసు? నేమ్ ప్లేట్ చూసిందా? అనుకుంటూ ఆవిడ మొహంలోకే చూస్తున్నాను.

దగ్గరలో ఉన్న దివాన్ మీద కూచుంది. పమిట కొంగతో మొహం తుడుచుకుంది.

''నేను హైదరాబాద్ నించి వచ్చాను. నా పేరు పద్మ. విశాలరావుగారు నా భర్త. ఆయన ముంబయ్ ఉద్యోగంలో చేరినప్పటినించి ఇంటికి రావటంలేదు. కలిసి ఉండటం లేదు. డబ్బు ఇస్తుంటారు. మా పెళ్ళయి ఐదేళ్ళయింది. నేను ఎక్కువ చదువుకోలేదు. డిగ్రీలు లేవు. ఆఫీసుల్లో తిరగటం, ఇల్లు వదిలి ఉద్యోగం చెయ్యటం నా కిష్టం లేదు. ఆయనకి నేనంటే ఇష్టమేననుకున్నాను. తెలిసిన వాళ్ళు చెప్పారు. ఆయన ఎవరో అమ్మాయితో ఉంటున్నారని అప్పుడు తెలిసింది ఆయనకి నేనంటే ఇష్టంలేదని. విడిపోయి చిన్న ఉద్యోగమేదో చేసి బతుకుదామనుకున్నాను. లేకపోతే చచ్చిపోవచ్చు. నాకేం కావాలి! కానీ ఈ పిల్లలు! ఎలాగో పోషించు కుందామను కుంటే స్నేహకే జబ్బు! నాకు కావలసిన వాళ్ళున్నారు కానీ ఈ ఖర్చులు భరించలేరు. పెద్దపిల్లని మా అమ్మ దగ్గర ఉంచాను. ఈ పిల్లని ఆయనకి అప్పగించి వెడదామని తెగించి ఇక్కడికి వచ్చాను. ఆఫీసులో అడిగితే ఆయన సెలవులో ఉన్నారని చెప్పారు. ఇంటికి వచ్చాను. నాకు సహాయం కావాలి'' అంది.

నా చుట్టూ ఉన్న ప్రపంచం గిర్రుమని తిరిగినట్లయింది 'నా స్వర్గం నించి ఎవరో నన్ను తోసేస్తున్నారు! నాలో చైతన్యాలన్నీ స్తంభించాయి. సోఫాలో కూర్చున్నాను. కళ్ళు మూసుకున్నాను. ఒక నిముషం....రెండు...మూడు...

రిపోర్ట్స్ తీసి చదివాను. ఈవిడ విశాల్ భార్య! అతడు చెప్పాడు తనకి పెళ్ళయిందని. మోసమేమీ లేదు. పద్మలో అక్కయ్య కనిపిస్తోంది.

నాకు తెలియని నా అంతరంగంలో ఒక చైతన్యం....

''నేను నా భర్తని నాకు వదిలిపెట్టమని అడగటానికి రాలేదు. స్నేహని అతడికి అప్పగించి వెడదామని వచ్చాను'' అంటోంది పద్మ మళ్ళీ.

''అప్పగించి?'' అన్నాను. నన్ను కోపం ఆవేశిస్తోంది. ఆ అమ్మాయి మీద కోపం వస్తోంది.

''వెళ్ళిపోతాను. ఎలాగో బతుకుతాను. బతక్కపోయినా నష్టం లేదు'' అంది

''అంటే చచ్చిపోదామనుకుంటున్నావా? ఏ సంప్రదాయం చెప్పింది సమస్యలకి చావు పరిష్కారమని!'' నన్ను నేను కంట్రోల్ చేసుకో లేకపోతున్నాను.

''భార్యని అంటున్నావు. మంగళ సూత్రం కట్టినంత మాత్రాన అతడికి నీ మీద ప్రేమ పుట్టుకు వస్తుందా? అతడిని నిలుపుకోటానికి నువ్వేం చేశావు? మట్టి ముద్దని ఎవరూ కన్నెత్తి చూడరు. కన్నీళ్ళు ఎవరినీ సమ్మోహపరచవు. ఈ ప్రపంచం మారి పోయింది. మనిషిని ధర్మం రక్షించే రోజులు పోయాయి. నిన్ను నువ్వే రక్షించుకోవాలి.

ఈ నాటి యువతి అప్సరసకి అర్థం చెప్తోంది.

ఈనాటి ప్రపంచంలో ఎన్నో అందాలు... ఆకర్షణలు... అన్వేషణలు

మనసు ఎవరికి తెలుస్తుంది?

భార్య అయినంత మాత్రాన నీ వాడైపోతాడా?

చిన్నతనంలో తండ్రి మీద ఆధారపడక తప్పదు.

పెరిగి పెద్దయ్యాక కూడా పెళ్ళి చేసుకుని అతడు పెట్టింది తింటూ ఇచ్చింది ట్టుకుంటూ జీవితాంతం అతడి నీడలో బానిసలాగ బతుకుదామనుకుంటున్నావా?

నీకు సిగ్గు లేదూ!

సుమతి, చంద్రమతిలాగ ఉంటే అతడు నీ కాళ్ళ మీద పడతాడనుకున్నావా?

ఈ ప్రపంచం ధనం, సుఖం, విజ్ఞానం వెంట పరుగు పెడుతోంది.

మనిషి స్వశక్తితో జీవించాలి.

నీ జ్ఞానం, పరిజ్ఞానం పెంచుకో. నీ వేష భాషలు మార్చుకో.

ఎవరి మీదా ఆధారపడకుండా నీ ఆర్థిక శక్తి పెంచుకో.

ముందు ఆ కన్నీళ్ళు ఆపు. నిన్ను నువ్వు దిద్దుకో.

ఎవరికీ చచ్చిపోవాలని ఉండదు. జీవితాన్ని ప్రేమించటం నేర్చుకో'' అన్నాను.

ఆ అమ్మాయి నన్నే చూస్తోంది. సోఫాలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాను. 'నా నిర్ణయం- నేను తొందరపడటం లేదు కదా! నేను విశాల్ కలిసి ఉండి స్నేహని పెంచుకోవచ్చు. పిల్లల్ని పోషించవచ్చు. కానీ అది పద్మకి అన్యాయం చెయ్యటం కాదా? నా మనసు విరిగి పోయిందా విశాల్ మీద! కాదు. అది విరిగిపోవటం కాదు. నేను ఒక న్యాయాన్ని కోరుతున్నాను.

సాంఘిక న్యాయానికి తల ఒంచుతున్నానా!

ఔను. తరతరాలుగా మనిషిని ముందుకు నడిపించే జీవ చైతన్యం ఉంది సాంఘిక న్యాయంలో ఒక కుటుంబంగా బ్రతకటంలో

మరి విశాల్ బాధపడడా నా నిర్ణయానికి!

స్నేహకోసం అతడు నన్ను మరిచి పోతాడు. మరిచిపోవాలి.

అతడి రూమ్‌లోకి వెళ్ళి ఉత్తరం రాశాను.

విశాల్,

పద్మని, స్నేహని నీకు అప్పగించి వెడుతున్నాను. ఈ బాధ్యతని నా మీద ప్రేమతో స్వీకరించు. మన స్నేహం ఎప్పటికీ ఉంటుంది. నీ మీరా,

ఉత్తరాన్ని అతడి డైరీలో పెట్టాను వెంటనే కనిపించేలాగ. నా సూట్‌కేస్ తీసుకున్నాను నా హాండ్ బేగ్ తీసుకున్నాను. రూమ్ కీ పద్మ చేతిలో పెట్టి

''అతడు సాయంత్రానికి వస్తాడు. నేను వెడుతున్నాను. నాకు నా జీవితం బరువు కాదు. నా ఆనందాన్ని నేను వెతుక్కోగలను. అతడు వచ్చాక ఎలాగ సమర్థించుకుంటావో! మేలుకో బ్రతకాలని కోరుకో. ఇదే నేను చేస్తున్న సహాయం'' అని బయటికి వచ్చి తలుపు వేశాను.

సెల్‌ఫోను తీసి కనుక్కున్నాను. హైదరాబాద్‌కి సాయంత్రం ఫ్లైట్‌కి టికెట్ దొరికింది. రోడ్డు మీదికి వచ్చి టాక్సీ పిలిచాను ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళమన్నాను. కారుపోతోంది. 'విశాల్‌ని వదిలి ఉండగలనా! ఉండాలి. మనిషి యొక్క యుగయుగాల చరిత్రలో క్షాళనం కాని పాప భారమేదో మనసులో బరువుగా పేరుకుంటోంది.

ఈ ఇంటినించి ఈ వాతావరణం నించి బయట పడ్డాను.

ఆ ఊబిలోంచి బయటపడగలనా! పడాలి!' అనుకున్నాను.

★

